ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

సోమవారం 17 ఫిబ్రవరి 2025





ములుగు జిల్లా కేంద్రం

- ఫలించిన సుదీర్ఘ ప్రజా పోరాటం
- 33వ జిల్లా ఆవిర్భవించి ఆరేళ్లు పూర్తి
- గిరిజన విశ్వవిద్యాలయం, మెడికల్ కళాశాలతో ప్రగతిబాట
- రామప్పకు యునెస్కో గుర్తింపుతో చారిత్రక వెలుగు
- తాజాగా బస్‌డిపోతో ముందడుగు
- పరిష్కారం కావాల్సిన సమస్యలు బోలెడు

ఆకాంక్ష నెరవేరి ఆరేళ్లు

ఏడో వసంతంలోకి ములుగు జిల్లా

ములుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు.. విశాలమైన సరిహద్దులు కలిగిన ప్రాంతం. దీని స్థాయి అంచెలంచెలుగా పెరుగుతూ వస్తోంది. తొలుత తాలుకా నుంచి రెవెన్యూ డివిజన్‌గా ఆవిర్భావించింది. ఆతర్వాత 9 మండలాలు, 174 గ్రామపంచాయతీలతో జిల్లాగా ఏర్పడింది. చారిత్రక, భౌగోళిక ప్రత్యేకతలు కలిగి ఉండి తెలంగాణ రాష్ట్రంలో చిట్టచివరగా ప్రకటించిన 33వ జిల్లాగా ములుగు మనుగడలోకి వచ్చి సోమవారం (17 ఫిబ్రవరి)తో ఆరేళ్ల పూర్తవుతోంది. అయితే.. జిల్లాను సాధించుకునేందుకు పోరాట స్ఫూర్తిని చాటిన ములుగు ప్రజల ఆకాంక్షలు సంపూర్ణమయ్యాయా? వారు కోరుకున్న ప్రగతి సాధ్యమైందా? ఈ ఆరేళ్ల కాలంలో జరిగిన పరిణామాలు సంతృప్తిపరిచాయా? అనే అనేక ప్రశ్నలకు సామాధానం లభించాల్సి ఉంది.

ములుగు జిల్లా 2019 ఫిబ్రవరి 17న అవతరించింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పునర్విభజన జరిగిన 2016లోనే జిల్లా ఏర్పాటవుతుందని ఆశించిన ఇక్కడి ప్రజలు నిరాశ ఎదురుకావడంతో ఉద్యమబాట పట్టారు. ప్రజల ఆకాంక్షను గుర్తించిన అప్ప టి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏడు, భద్రాద్రి కొత్తగూడెం సెగ్మెంట్ పరిధిలోని రెండు మండలాలు కలిపి జిల్లాగా ప్రకటించింది. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఏర్పాటైన మల్లంపల్లితో కలిపి మండలాల సంఖ్య 10కి చేరింది. 3,881 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో రాష్ట్రంలో 11వ అతిపెద్ద జిల్లాగా గుర్తింపు పొందింది. ఇందులో 2945.45 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉండటం, 90 కిలోమీటర్ల విశాలమైన, సుందరమైన గోదావరి తీరం కలిగి ఉండటం విశేషం. 2021 జూలై 25న వెంకటాపూర్ మండలంలోని రామప్పలోని రుద్రేశ్వరాలయం ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందింది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ రాతికట్టడం విశ్వఖ్యాతి పొందడటంతో ములుగు పేరు దేశవిదేశాల్లో మార్మోగింది.

విద్యారంగంలో ముందడుగు

డిగ్రీ కళాశాల కోసం ఒకప్పుడు ప్రజా ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి నుంచి దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయం, వైద్య కళాశాలలు ఏర్పాటు కావడం ములుగు జిల్లాకు శుభపరిణామంగా భావించొచ్చు. ఏపీ పునర్విభజన చట్టంలో తెలంగాణకు కేటాయించిన సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ములుగు జిల్లాలో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించగా కేంద్రం రూ.890 కోట్లను కేటాయించింది. 287 ఎకరాలను అప్పగించగా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, ములుగు మండలం జాకారంలోని వైటీసీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక క్యాంపస్‌లో రెండు కోర్సులతో మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రేమ్‌నగర్ వద్ద జిల్లా ఆస్పత్రి కోసం నిర్మించిన భవనంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. 50 మెడికల్ సీట్లు కేటాయించగా తరగతులు జరుగుతున్నాయి. ఇదే క్యాంపస్‌లో నర్సింగ్ కళాశాల కూడా కొనసాగుతోంది. ఈ రెండు సంస్థల ఏర్పాటుతో ములుగు ప్రాంతం విద్యపరంగా ముందడుగు వేసింది.

బస్‌డిపో కల సాకారం

అత్యధిక ఏజెన్సీ ప్రాంతం కలిగిన ములుగు వాసులను అనాదిగా రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. కలగానే మిగిలిపోతుందనుకున్న బస్‌డిపో ఏర్పాటుకు ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రూ.6.28 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఏటూరు నాగారంలో డిపో నిర్మాణం కానుండగా ములుగులో రూ.5.11 కోట్లతో మోడల్ బస్టాండును నిర్మించనున్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత ఆరేళ్లకు ఈరెండు కోరికలు నెరవేడంతో జిల్లా ప్రజల హర్షం వ్యక్తంచేస్తున్నారు. రూ.60 కోట్లతో గట్టమ్మ దేవాలయం సమీపంలో సమీకృత కలెక్టర్ కార్యాలయం పనులు పురోగతిలో ఉంది. ఇక్కడికి సమీపంలోనే జిల్లా పోలీసు, కోర్టు సముదాయాలను నిర్మించేందుకు చర్యలు ముమ్మరమయ్యాయి.

పెండింగ్‌లో ములుగు మునిసిపాలిటీ

అనుకున్నట్లుగానే మల్లంపల్లి మండలంగా ఏర్పడి జనవరి 24 నుంచి మనుగడలోకి వచ్చింది. కానీ, మేజర్ గ్రామపంచాయతీ హోదాతోనే జిల్లా కేంద్రంగా ఏర్పాటైన ములుగును మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రయత్నం పెండింగ్‌లో పడింది. గత ప్రభుత్వం చేసిన బిల్లును రీకాల్ చేసి సవరించిన బిల్లును ఆమోదించిన కొత్త సర్కారు.. దానిని గవర్నర్ పరిశీలనకు పంపించింది. అయితే.. రాజ్‌భవన్ ఇంకా ఓకే చెప్పలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముందే మునిసిపాలిటీ శుభవార్త వినాలని స్థానికులు ఆశపడుతున్నారు.

ఎడతెగని ఎదురుచూపులు

పాతికేళ్ల క్రితమే కన్నాయిగూడెం మండలం దేవాదులలో భారీ ఎత్తిపోతల పథకానికి

(మిగతా 8వ పేజీలో)



ప్రగతిపథంలో ముందుకు

ములుగు జిల్లాను ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తున్నాం. పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం. బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపించి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి జరుగుతోంది. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చివరి దశకు చేరింది. త్వరలో ట్రైబల్ వర్సిటీ పనులు మొదలవుతాయి. మెడికల్ కళాశాల, యూనివర్సిటీల్లో తరగతులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నాం.

\- టీఎస్.దివాకర, కలెక్టర్



గద్దెల ప్రాంగణంలో భక్తులు

అదే భక్తి.. అవే మొక్కులు..

- మేడారంలో తగ్గని భక్తజన సందోహం
- తల్లులకు మొక్కులు చెల్లించుకున్న లక్ష మంది భక్తులు
- వారాంత సెలవు కావడంతో భారీ సంఖ్యలో రాక

తాడ్వాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారంలోని వనదేవతల సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. నాలుగు రోజులపాటు జరిగిన మినీ జాతర శనివారం ముగిసినా సందడి నెలకొంది. ఆదివారం కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. వనదేతలను సుమారు లక్ష మంది దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పూజారుల గద్దెల వద్ద ఉంచి భక్తులకు పూజలు చేసి అమ్మవార్ల ఆశీస్సులతో పాటుగా దర్శనభాగ్యం కల్పించారు. ముందుగా జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. సమ్మక్క, సారలమ్మల నామాన్ని జపిస్తూ గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తు బంగారంతో క్యూలైన్ల ద్వారా అమ్మవార్లను దర్శించుకొని ఎత్తుబంగారం, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం వారాంత సెలవు కావడంతో భక్తులు మేడారానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వనదేవతలను దర్శనాల అనంతరం వీరితోపాటు మినీ జాతరలో నాలుగు రోజులపాటు పాల్గొన్న భక్తులు కూడా తిరుగుప్రయాణమయ్యారు. 'చల్లగా చూడు తల్లీ.. తిరిగి మళ్లీ మహా జాతరకు వస్తాం' అని వనదేవతలను మొక్కి అక్కడి నుంచి బయల్దేరారు. కాగా, మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను మహా జాతర పునరుద్ధరణ కమిటీ మాజీ చైర్మన్ అరెం లచ్చుపటేల్ ఆదివారం దర్శించుకున్నారు.



వనదేవతల సన్నిధిలో గంట కొడుతున్న భక్తులు



తిరుగు ప్రయాణం చేస్తున్న భక్తులు



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు

- బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది..
- రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో మోదీపై రేవంత్ బురదజల్లే ప్రయత్నం
- పట్టభద్రులు, టీచర్ల సమస్యలపై పోరాడతాం
- కాంగ్రెస్ పాలన గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ఉంది..
- రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం
- టీచర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, డీఏలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

7

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో ఆదివారం సందడి నెలకొంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పవిత్ర లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. బిల్వార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. మేడారం మినీ జాతరకు వెళ్లిన భక్తులు తిరిగి వస్తున్న క్రమంలో కాళేశ్వరాన్ని పెద్ద ఎత్తున దర్శించుకుంటున్నారు. వారికి ఎలాంటి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



కాళేశ్వరంలో భక్తుల రద్దీ



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

బడి పిల్లలకు మళ్లీ కంటిపరీక్షలు

నేటి నుంచి ప్రారంభం.. 28 వరకు కొనసాగింపు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరోసారి కంటిపరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం తీసుకుంది. స్కూల్ ఐ స్కానింగ్ ప్రోగ్రాం కింద ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది ఆగస్టులో మొదటి విడత కంటి పరీక్షలు నిర్వహించారు. తిరిగి అక్టోబరు, నవంబరు వరకు రెండు విడతల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ట్రైబల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 698 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి మరోసారి పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా వైద్య ఆరోగ్య ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 28 వరకు జిల్లా కేంద్రంలోని వందపడకల ఆస్పత్రిలోని డైస్ సెంటర్‌లో కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం మొబైల్ హెల్త్ టీం వాహనాల్లో విద్యార్థులను ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేస్తారు. తాజా స్కానింగ్ తర్వాత అవసరమైన వారికి వెంటనే కళ్లద్దాలు అందజేస్తారు.



గ్రామం సమీపంలో పులి పాదముద్ర

అదిగో పులి.. ఇవిగో ఆనవాలు

కాటారం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పెద్ద పులి సంచారం మండలంలో ఇంకా కలవరం పెడుతూనే ఉంది. కొన్ని రోజులుగా ఇక్కడే తిరుగుతోందని ఆనవాలు చెబుతుండగా తాజా శనివారం రాత్రి గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీ పక్క నుంచే పెద్ద వెళ్లిందని స్థానికులు అంటున్నారు. కాలనీ సమీపంలోని అడవి నుంచి గోదావరి వైపు పులి వెళ్తుండగా కుక్కలు పెద్ద ఎత్తున మొరగడంతో అది వెనుతిరిగి మళ్లీ అడవుల్లోకే వెళ్లినట్లు అనుమానిస్తున్నట్లు గ్రామస్థులు, అధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ మేరకు గ్రామ సమీపంలో పులిపాదముద్రలు కనిపించడంతో పులి వచ్చి వెళ్లింది వాస్తవమేనని భావిస్తున్నారు. కాలనీవాసులు ఇచ్చిన సమాచారంతో కాటారం ఎఫ్‌ఆర్వో స్వాతి, ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి కొందరు గ్రామస్థులను వెంటతీసుకుని పాదముద్రలు ఉన్న ప్రాంతాల్లో గాలించారు. పులి గుండ్రాత్‌పల్లి అడవుల నుంచి పక్కనే ఉన్న అన్నారం అడవుల్లోకి వెళ్లినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ అన్వేషణలో అటవీ అధికారులు సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, ప్లాంటేషన్ల వాచర్లు తదితరులు పాల్గొంటున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని ఎండీ క్వార్టర్స్‌కు చెందిన పూదరి ఓంకార్ (32) సింగరేణి కేటీకే 5 ఇన్‌క్లైన్‌లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. అతడితో పాటు ఇదే గనిలో అండర్ మేనేజర్లుగా పనిచేస్తున్న రాము, సంజయ్, కార్మికుడు దేవేందర్ ఓ వివాహ వేడుకకు కారులో మంచిర్యాలకు వెళ్లారు. తిరిగి భూపాలపల్లికి వస్తుండగా మంచిర్యాల ఫ్లైఓవర్ సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొంది. దీంతో కారు బోల్తాపడగా ఓంకార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాము, సంజయ్, దేవేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారును ఓంకార్ డ్రైవ్ చేస్తున్నాడు.



మృతుడు ఓంకార్ (ఫైల్)

ఉద్యోగం వచ్చిన రెండేళ్లకే..

మృతుడు ఓంకార్ బీఆర్‌ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌లో ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొనసాగుతున్నాడు. రెండేళ్ల క్రితమే తన తండ్రి డిపెండెంట్ ఉద్యోగాన్ని అతడు పొందాడు. మృతుడికి భార్య సాయి సౌజన్యతోపాటు ఐదు నెలల కుమారుడు ఉన్నారు. ఓంకార్ మృతితో కుటుంబ సభ్యులతోపాటు అతడు నివసిస్తున్న కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

గణపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని గాంధీనగర్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోటపోతుల రాజు(36) తన సొంత ట్రాక్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పని నిమిత్తం మైలారం వైపు వెళ్తుండగా మిషన్ భగీరథ పంప్ హౌస్ వైపు మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మార్గ మధ్యలోనే రాజు మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, ముగ్గురు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించారు.



రాజు (ఫైల్)

జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- ఆదివాసీ సంఘాల ధర్నా
- హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- ఏడుగంటల పాటు బైఠాయింపు

6



వినీత్ (ఫైల్)



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

295 మంది విద్యార్థులు హాజరు

కాటారం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ట్రైబల్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎస్టీ గురుకులం పరీక్ష కేంద్రానికి భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ తదితర జిల్లాలకు చెందిన 320 మంది విద్యార్థులను కేటాయించగా 295 మంది పరీక్ష రాశారు. 25మంది గైర్హాజరైనట్లు సీఎస్ రాజేందర్, అబ్జర్వర్ నాగలక్ష్మి, డీవో మాధవి తెలిపారు. సుదూర ప్రాంతం నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్ష అనంతరం ఎస్టీ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ రాజేందర్, నాగలక్ష్మి ఆధ్వర్యంలో వార్డెన్, అధ్యాపకులు పులిహోర ప్యాకెట్లు, తాగునీటిని అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి, డిప్యూటీ వార్డెన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

• మానుకోట పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నయీమొద్దీన్



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు జట్టుకు కప్‌ను అందజేస్తున్న మానుకోట నయీమొద్దీన్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలని మానుకోట సబ్ డివిజనల్ పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నయీమొద్దీన్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 9న ప్రారంభమైన మహబూబాబాద్ పోస్టల్ ప్రీమియర్ లీగ్ (ఎంపీపీఎల్) సీజన్-2 క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 8 జట్లు తలపడగా అందులో ఫైనల్‌లో వరంగల్ హెడ్‌పోస్టాఫీసు, కురవి పోస్టాఫీసు జట్లు పోటీ పడ్డాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న కురవి జట్టు 10 ఓవర్లలో 61 పరుగులు చేసింది. వరంగల్ హెడ్‌పోస్టాఫీసు జట్టు 9 ఓవర్లలోనే 62 పరుగులుచేసి ప్రథమ స్థానంలో నిలిచి కప్‌ను కైవసంను చేసకున్నారు. విజేతలకు మానుకోట పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్‌చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మహబూబాబాద్ హెడ్‌పోస్టుమాస్టర్ వాసం అనిల్, పెండ్ర రాంచందర్, కోట సుధాకర్, సంపత్, ఆర్.ప్రభాకర్, సురేష్, సుధాకర్, భరత్, మురళీకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారుల పేరుతో
ఫోన్ వస్తే సంప్రదించాలి

• ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులకు ఫేక్ ఫోన్ కాల్స్ వస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్ ఫారంలైన వాట్సాప్ నెంబర్ 9440446106, లేదా ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో సంప్రదించవచ్చని, బాధితుల వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. నకిలీ కాలర్స్‌ను నమ్మి ఎలాంటి చెల్లింపులు చేయరాదని పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పుడు ఫోన్‌చేయరని, ఈ విషయాన్ని ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

'గిరిజనులను మోసం చేసిన శంకర్‌నాయక్'




కేసముద్రంలో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు దస్రూనాయక్, మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి

కేసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల విరాళాలు, సీడీఎఫ్ నిధులతో నిర్మించిన సంతు సేవాలాల్ గుడి ప్రాంగణాన్ని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తన సొంత ఇల్లు అని చెప్పడం గిరిజన జాతిని మోసం చేయడమేనని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కేసముద్రంలో ఆదివారం విలేఖరులతో వారు మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 50వేల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించిన ఏకైక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అని, శంకర్‌నాయక్ రెండు పర్యాయాలు పదివేలలోపు మెజార్టీతో గెలిచిన చరిత్ర అని దుయ్యబట్టారు. సేవాలాల్ ఉత్సవాలను ఎమ్మెల్యే ఉత్సవ చైర్మన్‌గా గిరిజనులతో భారీ ర్యాలీతో వెళ్లి నిర్వహించడం, మరోవైపు సేవాలాల్ గుడిని, ఆ ప్రాంతాన్ని గిరిజన జాతికి అంకితం చేస్తానని ప్రకటించడంతో జీర్ణించుకోలేక దిగజారుడు వ్యాఖ్యలను శంకర్‌నాయక్ చేస్తున్నాడని ఆరోపించారు. ప్రజా క్షేత్రంలో మరోసారి శంకర్‌నాయక్‌ను ఓడించేందుకు ప్రజలు, గిరిజనులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, పొలెపాక నాగరాజు, చిదిరాల వసంతరావు, ఎండీ.అయూబ్‌ఖాన్, దామరకొండ ప్రవీణ్, బానోత్ చిన్నవెంకన్న, తాజొద్దీన్, నవాజ్, సుమన్, మహేష్, సేవల్, శేఖర్‌రెడ్డి, మహేష్, వీరు పాల్గొన్నారు.

జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

• ఆదివాసీ సంఘాల ధర్నా
• హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
• ఏడు గంటల పాటు బైఠాయింపు





వినీత్ (ఫైల్)

పేరూరులోని వసతి గృహం ఆవరణలో ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

వాజేడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జ్వరం, కడుపునొప్పి బారిన పడి ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పేరూరుకు చెందిన సోయం వినీత్(13) అదే గ్రామంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 11న హాస్టల్‌లో అతడికి కడుపునొప్పి రావడంతో ఏఎన్‌ఎం ట్యాబ్లెట్ ఇచ్చింది. దీంతో ఆరోగ్యం కాస్త కుదటపడింది. అనంతరం ఆశ్రమ పాఠశాలకు మేడారం జాతర నిమిత్తం రెండు రోజుల పాటు సెలవులు ఇవ్వడంతో తన మేనమామ ఇంటికి వినీత్ వెళ్లాడు. అనంతరం శనివారం ఉదయం జ్వరం రావడంతో మండలంలోని ధర్మవరంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు అతడిని తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయిన వినీత్‌కు మళ్లీ అదేరోజు సాయంత్రం జ్వరం తీవ్రంగా పెరిగింది. దీంతో ఆర్‌ఎంపీ సూచన మేరకు అతడిని వైద్యం కోసం ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందాడు. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే కుటుంబాన్ని వదిలేయగా తల్లి శైలజ జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటోంది. మేనమామ వద్ద ఉంటూ వినీత్ చదువుకుంటున్నాడు. కొడుకు మృతితో తల్లి రోదనలు మిన్నంటాయి. శైలజకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉండగా పెద్ద కొడుకు వినీత్ మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

ఆదివాసీ సంఘాల ఆందోళన

విద్యార్థి వినీత్ మృతికి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ కారణమంటూ ఆదివాసీ సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు ఉయిక శంకర్ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల ఆవరణలో సుమారు 7గంటల పాటు బైఠాయించారు. వసతి గృహం హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే వినీత్ మృతి చెందాడని ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదంటూ నినదించారు. ఉపాధ్యాయుల పిల్లలను ఇదే ఆశ్రమ పాఠశాలలో చదివిస్తేఇలానే చూసుకుంటారా? అని ప్రశ్నించారు. హెచ్‌ఎం, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేద ఆదివాసీ బిడ్డలపై ఇంతలా నిర్లక్ష్యం పనికి రాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లికి న్యాయం చేయాలని కోరారు. ఒక ఆదివాసీ విద్యార్థి మృతిచెందితే ఐటీడీఏ అధికారులు పరామర్శించకపోగా కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీవో, డీడీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడే ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించిందా?

విద్యార్థి మృతికి హెచ్‌ఎం, వార్డెన్‌లు కారణమంటూ ఆందోళన చేస్తున్న క్రమంలో స్థానికులు ఆర్‌ఎంపీ వైద్యం ఏమైనా వికటించిందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం జ్వరం రావటంతో ధర్మవరంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు వైద్యం నిమిత్తం విద్యార్థి వినీత్ మేనమామ తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆ ఆర్‌ఎంపీ ఏమైనా ఇంజెక్షన్లు, యాంటీబయోటిక్స్ ఎక్కువ డోసులు ఏమైనా ఇచ్చారా? అనే అనుమానాలుసైతం వ్యక్తమవుతున్నాయి. ఆర్‌ఎంపీ వైద్యం అనంతరం మళ్లీ జ్వరం రాగా ఏటూరునాగారం తీసుకెళ్తుండగానే పరిస్థితి విషమించి వినీత్ మార్గమధ్యలో మృతి చెందటం అనుమానాలకు తావిస్తోంది.



నీటి పంపుతో పొలం పారిస్తున్న రైతు

సాగునీటి కోసం
భగీరథ ప్రయత్నం

చిన్నగూడూరు(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కోసం ఓ ఆరు పదుల వయస్సున్న రైతు భగీరథ ప్రయత్నమిది. ప్రాణంలా చూసుకుంటున్న పంట కళ్ల ముందే ఎండిపోతుంటే జీర్ణించుకోలేని ఓ అరవై ఏళ్ల రైతు సాగునీటి కోసం గ్రామంలోని నీటి పంపునకు 15 పైపుల లెంతులో పైపులను పరిచాడు. రోజంతా పంపుకొడుతూ తన 20 గుంటల పొలానికి నీటిని పారిస్తున్నాడు మండలంలోని ఉగ్గంపల్లికి చెందిన గంగధరి వెంకటయ్య. బోరులో నీళ్ల ఊట రాకపోవడంతో పంటను కాపాడుకోవడానికి తప్పట్లేదని వాపోయాడు. ఎస్‌ఆర్‌ఎస్పీ కాల్వకు నీళ్లు వదిలితే మేలు జరుగుతుందని చెప్పుకొచ్చాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో
చెలరేగిన మంటలు



వడ్డెకొత్తపల్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు ఆర్పుతున్న సిబ్బంది

పెద్దవంగర(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డెకొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి బ్లాస్ట్ అయిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ట్రాన్స్‌కో ఏఈ వినోద్‌కుమార్ వివరాలప్రకారం... వడ్డెకొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో అధిక లోడు కారణంగా, అంతర్గత లోపాలతో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి బ్లాస్ట్ అయినట్లు తెలిపారు. సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌లోని మంటలను ఆర్పడంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదన్నారు. సుమారు రూ.1లక్ష ఆస్తినష్టం జరిగిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో 20 నిమిషాలు విద్యుతు సరఫరాలో అంతరాయం కలిగింది. సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

'ఉద్యోగ విరమణ పొంది ఏడాదైనా అందని బెనిఫిట్స్'



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో సేవలందించి.. పదవీ విరమణ పొందిన వారికి వెంటనే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గుగులోతు కిషన్‌నాయక్, అంబటి రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పట్టణంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందని రిటైర్డ్ ఉద్యోగులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో తాము దాచుకున్న డబ్బును పదవీ విరమణ అయ్యాక ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని అన్నారు. మార్చి 2024 సంవత్సరంలో రిటైర్‌మెంట్ అయిన ఉద్యోగులకు నేటి వరకు ఎలాంటి బెనిఫిట్స్ అందక పోవడం బాధకరమన్నారు. బెనిఫిట్స్‌రాక పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆందోళనకు గురై అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు. తక్షణమే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించి తమను ఆదుకోవాలని కోరారు. వీరికి తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షైన నాగయ్య సంఘీభావం ప్రకటించి మాట్లాడారు ఏడాది కాలంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాక పదవీవిరమణ పొందిన ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలు రాక ముందే ప్రభుత్వం వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ఈ సమావేశంలో నారాయణ, బాలాజీ, వెంకట్ రెడ్డి, శంకర్‌రావు, వీరస్వామి పాల్గొన్నారు.

నల్లబెల్లం తరలిస్తున్న
వాహనం సీజ్

• ఒకరిపై కేసు నమోదు

సీరోలు (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, ఒకరిపై కేసు నమో దు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీరోలు మండలకేంద్రంలో ఆదివారం టవేరా వాహనంలో ఇద్దరు వ్యక్తులు నల్లబెల్లం తరలిస్తున్నారన్న సమాచారం తమకు అందిందని తెలిపారు. వెంటనే సిబ్బందితో కాపుకాసి ఆ వాహనాన్ని సీజ్‌చేసి, అందులో ఉన్న 8 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాకు చెం దిన ఇద్దరు వ్యక్తులు నల్లబెల్లం తరలిస్తుండగా ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దుర్గామాత ఆశీస్సులతో అన్నివిధాలా సంక్షేమం

» బీఆర్‌ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి
» మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత ఆశీస్సులతో అన్ని విధాలా సంక్షేమం చేకూరుతుందని, ప్రజల సుభిక్షం కోసమే గ్రామ దేవతలను పూజిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గంట్లకుంట దుర్గామాత వేడుకల్లోపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగకు ఓ చరిత్ర ఉందని, పూర్వీకుల నుంచి సంస్కృతి కట్టుబాట్లకు తెలంగాణ రాష్ట్రం పుట్టినిల్లు అని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటూ అన్ని మతాల ప్రజలు కలిసి ఉంటారని అన్నారు. ఈ సంస్కృతి దేశంలో ఎక్కడా లేదని కొనియాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ఎంతోగానో కృషి చేశారని, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆలయాలను అభివృద్ధి చేశారని అన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులతో పాడిపంటలతో ప్రజలందురూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. భక్తిభావం పెంపొందించడం కోసమే దేవతలను పూజిస్తారన్నారు. సంవృద్ధిగా వర్షాలు పడి పాడిపంటలు బాగుండాలని గ్రామదేవతలను పూజించడం మన సంస్కృతి అని అన్నారు. కాగా, గ్రామంలో ఉదయం ఇంటిపాది తరలివెళ్లి దేవతలకు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మాజీ జీసీసీ గాంధీనాయక్, మాజీ మండల అధ్యక్షుడు పాలకుర్తి యాదగిరిరావు, శ్రీరాం సుధీర్, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, శ్రీరాం సంజయ్, జ్ఞానేశ్వరాచారి, చింతల భాస్కర్, పటేల్, వీరన్న, హరీష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో సండే సందడి



రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, విద్యార్థులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో భక్తులు, విద్యార్థుల సందడి నెలకొంది. ఆదివారం వారాంత సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, పాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు క్యూ పద్ధతిన రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు. అదేవిధంగా ఆలయానికి తూర్పు ముఖ ద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కొద్దిసేపు ఆలయ గార్డెన్‌లో సేదతీరిన తదుపరి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకిస్తూ ఆనందంగా గడిపారు. అదేవిధంగా అమెరికా దేశానికి చెందిన జెమ్, స్టెఫానీలు రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం వారు ఆలయ శిల్పకళను వీక్షించి శిల్పకళా సౌందర్యాన్ని తమ కెమెరాల్లో బంధించుకున్నారు. సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరించారు.

వేర్వేరు సంఘటనల్లో
పోక్సో కేసులు నమోదు

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బాలికలపై వేధింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై ఆదివారం పోక్సో కేసు నమోదు అయినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని రెండు గ్రామాల్లో బాలికలపై వేధింపులకు పాల్పడిన తమ్మడపల్లి సురేష్, శివరాత్రి వెంకటేశ్‌పై పోక్సో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

» తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య
» ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న బుర్స పోచయ్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల రిజర్వేషన్లను అనుభవిస్తున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని గిరిజన భవన్ ఆవరణలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన ఆదివాసీల హక్కుల కోసం పాలకులపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పీసా యాక్ట్ చట్టాన్ని అమలుచేసి ఆదివాసీలకే జల్, జమీన్, జంగల్‌పై హక్కులు కల్పించాలని అన్నారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థల వనరుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 7 నుంచి 9 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలోని జోడెన్‌ఘాట్‌లో నిర్వహించే తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీలకు బుర్స పోచయ్య పిలుపు నిచ్చారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్లు గోడెం గణేష్, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, కొట్నాక విజయ్, ఈసంనర్సింహారావు, ఆగబోయినరవి, మెస్రం మోలురాం, వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ములుగు అడవుల్లో అగ్గి

» వేసవికి ముందే మొదలైన మంటలు
» అదుపు చేసేందుకు శ్రమిస్తున్న అటవీ సిబ్బంది
» గాయపడ్డ ఇద్దరు బీట్ అధికారులు



ములుగు మండలం కన్నాయిగూడెం అడవిలో బ్లోయర్‌తో మంటలను ఆర్పుతున్న అటవీ శాఖ సిబ్బంది

ములుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అడవులను అగ్ని దహించి వేస్తోంది. మూడురోజులుగా పలు మండలాల పరిధిలో మంటలు వ్యాపిస్తున్నాయి. వీటిని అదుపుచేసేందుకు అటవీ శాఖ సిబ్బంది శ్రమిస్తున్నారు. వేసవిలో అటవీ ప్రాంతం, గుట్టలపై ఎరగడి మంటలు సాధారణంగా వస్తుంటాయి. కానీ, ఎండాకాలం ప్రారంభానికి ముందే వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పస్రా, ఒడ్డుగూడెం, వాజేడు, ములుగు సమీపంలోని లోకంచెరువు, ప్రేమ్ నగర్, సర్వాపూర్, కన్నాయిగూడెం సమీపంలోని అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ములుగు సమీపంలోని లోకంచెరువు పరీవాహక గుట్టలు మూడురోజులుగా కాలుతున్నాయి. మంటలను అదుపు చేసేందుకు 30 మందికి పైగా సిబ్బంది పని చేస్తున్నారు. బ్లోయర్లతో ఫైర్‌లైన్లు ఏర్పాటుచేస్తున్నా మరోచోట నిప్పు పుడుతోంది. మంటలను ఆర్పే క్రమంలో శనివారం ఓ మహిళా బీట్ అధికారికి స్వల్ప గాయాలు కాగా పస్రా రేంజ్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న దీప్‌లాల్ చెయ్యి విరిగింది. ఆకులురాలే సమయం కావడంతోనే ప్రమాదాలకు ఎక్కువ అవకాశముందని ములుగు రేంజ్ అధికారి డోలి శంకర్ తెలిపారు. సమీపంలోని పొలాలలో వరి, మొక్కజొన్న కొయ్యలను కాల్చేందుకు పెట్టిన మంటలు అడవికి వ్యాపిస్తున్నాయని చెప్పారు.



లోకంచెరువు సమీపంలోని గుట్టపై మంటలు

మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నామన్నారు. కాగా, మంటల తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ఉన్నతాధికారులు శాటిలైట్ మ్యాప్ ద్వారా కొత్తగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో గమనిస్తున్నారు. అలర్ట్ వచ్చిన వెంటనే సిబ్బందిని పంపిస్తున్నా ఆశించిన స్థాయిలో మంటలు అదుపులోకి రావడంలేదు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- చిరు ధాన్యాలతో అల్పాహారం, రాగి జావతో రక్ష
- క్రీడా మైదానాల వద్ద వెలుస్తున్న షాపులు
- అందుబాటులో విభిన్న రకాల జ్యూస్‌లు
- ఉపాధి పొందుతున్న పలువురు నిరుద్యోగులు

ఆధునిక జీవితంలో ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజు రోజుకూ అవగాహన పెరుగుతోంది. ప్రసార మాధ్యమాలు, వైద్య నిపుణుల సలహా మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. ఆరోగ్య స్పృహతో మితాహారం మేలని అన్ని వయస్సుల వారు గ్రహిస్తున్నారు. ఈ క్రమంలో చిరుధాన్యాలు, రాగిజావా, జొన్నగటుక, మొలకెత్తిన ధాన్యాలను ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు. నిత్యం భుజించే ఆహార పదార్థాలకు భిన్నంగా ఆలోచన చేస్తూ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలకు మందులు వెచ్చించే సగానికి పైగా డబ్బులతో అవి రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వరంగల్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కరోనా తర్వాత వ్యాయామంపై అందరికీ ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా వరంగల్ నగరంలో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో తమ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు వయోభేదం లేకుండా సమీపంలోని పార్కులు, మైదానాలకు బారులు తీరుతూ వాకింగ్ చేస్తున్నారు. అదే విధంగా పార్కులు, క్రీడా మైదానాల సమీపంలో విక్రయిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలతో చేసిన జ్యూస్‌లను సేవించడంతో పాటు పోషక విలువలు గల రాగిజావా, గటక, చిరుధాన్యాలు, మొలకెత్తిన . ధాన్యాలను భుజిస్తూ ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.

చిరు ధాన్యాలతో అల్పాహారం

వివిధ రకాల రుగ్మతులు కలిగిన వారు ఉదయం అల్పాహారం తీసుకుని మందులు వేసుకుంటారు. ఈ నేపథ్యంలో నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావించి.. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను భుజించడానికి మొగ్గు చూపుతున్నారు. పలు క్రీడా మైదానాలు, వాకింగ్ చేసే పార్కుల వెంబడి పదుల సంఖ్యలో చిరుధాన్యాలు, జ్యూస్‌లు అందించే విక్రయదారులు పెరిగిపోతున్నారు. నగర వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు రుచికరమైన రాగులతో చేసిన ఇడ్లీ, దోశ, కొర్రల ఉప్మా,



హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వద్ద జ్యూస్ విక్రయిస్తున్న యువకుడు

మిల్లెట్ దోశలు తయారు చేస్తూ విక్రయాలు జరుపుతూ ఉపాధిని పొందుతున్నారు. వీటిలో పీచు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం ఎక్కువగా లభించడంతో పాటు కొవ్వు శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో మధుమేహం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారాన్ని తీసుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

విభిన్న రకాల జ్యూస్‌లు

ఉదయం వేళల్లో క్రీడా మైదానాల బాటపట్టిన పలువురు వ్యాయామం పూర్తికాగానే సమీపంలోని జ్యూస్ కేంద్రాలను ఆశ్రయిస్తూ నచ్చిన జ్యూస్‌లను సేవిస్తున్నారు.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలు రకాల జ్యూస్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. బూడిద గుమ్మడికాయ, సొరకాయ, క్యారెట్, బీట్‌రూట్, మునగాకు, గోధుమగడ్డి, కలబందలతో జ్యూస్‌లు తయారుచేసి కేంద్రాలు నగరంలో చాలా వెలిశాయి. వీటిల్లో అధిక పోషక విలువలు ఉంటాయని పలువురు వైద్య నిపుణులు తెలుపడంతో ఊబకాయం, వివిధ రకాల రుగ్మతుల నివారణ కోసం జ్యూస్ కేంద్రాల వద్దకు ప్రజలు బారులు తీరుతున్నారు.

జావ విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నా..



బి. రమాదేవి, వరంగల్

కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పదో తరగతి వరకు చదుకున్నాను. వ్యాపారం చేయాలంటే లక్షల్లో పెట్టుబడి పెట్టా ల్సి ఉంటుంది. దీంతో నా భర్త సహకారంతో హనుమకొండ జేఎన్ఎస్ గేటు వద్ద 11ఏళ్లుగా ప్రతీరోజు మొలకెత్తిన గింజలతో పాటు పజ్జొన్నల, రాగులు, సజ్జలతో తయారుచేసిన జావాను ఉదయం మైదానానికి వచ్చే వాకర్లకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాను. కుటుంబ పోషణకు, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి రోజులో 10నుంచి 12గంటల వరకు సమయం వెచ్చించి రాగి జావా విక్రయిస్తున్నాను. పెద్ద కుటుంబం కావడంతో పిల్లలను చదివిస్తూ ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఈ వ్యాపారం ఎంతో దోహదపడింది.

పీజీ, బీఈడీ చదివినా ఉద్యోగం రాలేదు..



ఎం.కల్యాణ్ కుమార్ (జావ విక్రయదారుడు)

పీజీ, బీఈడీ వరకు చదివినా ప్రభుత్వ ఉద్యోగం లభించక పోవడంతో ఏమి తోచని సందర్భంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద ఐదేళ్ల కిందట జ్యూస్ విక్రయించడం ప్రారంభించాను. నగర ప్రజల్లో ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ కారణంగా జ్యూస్ అమ్మకాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పెద్ద చదువులు చదివినా ఉద్యోగం లేని నాకు జ్యూస్ విక్రయాలతో నా కుటుంబానికి ఆర్థికంగా అసరా దొరికింది. ప్రజల్లో ఆరోగ్య స్పృహతో వివిధ రకాల జ్యూస్‌లు తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. మునగాకు, బూడిద గుమ్మడి, సొరకాయ, కాకరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోధుమ గడ్డి, కలబందతో తయారు చేసిన జ్యూస్‌లో అందు బాటులో ఉండటంతో వాకర్లు ఆసక్తి కనబరుస్తున్నారు.



పాలు పితుకుతున్న రైతు దినేష్



దినేష్ పెంచుతున్న పాడి గేదెలు

కంప్యూటర్ వదిలి.. పాలు పట్టి..

- పాడి పరిశ్రమతో యువకుడి స్వయం ఉపాధి
- నెలకు రూ.లక్ష సంపాదిస్తున్న దినేష్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని, నిరుద్యోగ యువత, నిరాశ నిస్పృహలకు లోను కావద్దు.. స్వయం ఉపాధితో ఆర్థికంగా బలపడాలని ఇంజనీరింగ్ చదివిన ఓ యువకుడు నిరూపిస్తున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నాలుగేళ్లుగా చేసిన ఆ యువకుడు.. నగరంలో వాతావరణ కాలుష్యం తట్టుకోలేక.. తాను పుట్టి పెరిగిన పల్లెటూరిలోని స్వచ్ఛమైన వాతావరణంలో పాడిపరిశ్రమ వైపు దృష్టి సారించాడు. ఒక పాడి గేదెతో ప్రస్థానం ప్రారంభించాడు. ఐదేళ్ల కిందట సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. నేడు ఎనిమిది పాడి గేదెలతో రోజుకు 40 లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తూ నెలకు రూ.లక్ష సాధిస్తూ యువతకు భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన కరెట్లపల్లి దినేష్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కరెట్లపల్లి దినేష్ పదో తరగతి పెద్దపూర్‌లోని రెసిడెన్సియల్ పాఠశాలలో పూర్తి చేశాడు. వరంగల్‌లో పాలిటెక్నిక్ చేసిన దినేష్.. 2017లో బీటెక్ పూర్తి చేశాడు. అప్పుడే సాఫ్ట్‌వేర్ కంపెనీలో హైద్రాబాద్‌లో ఉద్యోగంలో చేరాడు. నెలకు రూ.30వేలకు పైగా వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కానీ హైదరాబాద్‌లో కాలుష్యం కోరలు, నిత్యం వాహనాల రద్దీతో ఆఫీస్‌కు వెళ్లాలంటే వాహనాల రద్దీతో తీవ్ర మథనపడేవాడు. దీంతో తన కాళ్లపై తాను నిలబడి పాడిపరిశ్రమను చేపట్టాలని దృఢంగా సంకల్పించాడు. 2019లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తన స్వగ్రామమైన రత్నగిరిలో ఒక పాడి గేదెతో తన ప్రస్థానం మొదలు పెట్టాడు. నేడు 8 పాడి గేదెలను సమకూర్చుకున్నాడు. ఒక్కొక్క పాడి గేదెలకు రూ.1.30లక్షలు పెట్టి హైద్రాబాద్‌లో కొనుగోలు చేశాడు. క్రమంగా పాడి పరిశ్రమతో స్వయం ఉపాధి పొందుతున్నాడు. ఆ పాడి గేదెలకు అవసరమైన చిన్న చిన్న వైద్యాన్ని సైతం నేర్చుకుని తానే చేస్తున్నాడు. ఇందు కోసం తన పాడి గేదెల షెడ్డు వద్ద ఓ ట్రీవి బోల్‌ను ఏర్పాటు చేసుకొని పాడి గేదెలకు వైద్యం సైతం చేస్తున్నాడు.

రోజూ 40 లీటర్ల పాల ఉత్పత్తి

ప్రతీ రోజు తనకున్న ఎనిమిది పాడి గేదెలతో ప్రతీరోజు 40 లీటర్ల పాలను సేకరిస్తున్నాడు. పాలను అర లీటర్, లీటర్ ప్యాకెట్లలో ప్యాకింగ్ చేస్తున్నాడు. తమ గ్రామంతో పాటు హుజూరాబాద్ పట్టణానికి పాల ప్యాకెట్లను చేరవేస్తూ విక్రయిస్తున్నాడు. లీటర్ పాలకు రూ.80 చొప్పున పాల ప్యాకెట్లను విక్రయిస్తున్నాడు. దినేష్ చేస్తున్న పాలప్యాకెట్లు నాణ్యమైనవిగా ఉండడంతో హుజూరాబాద్ పట్టణంలో వెంటనే అమ్ముడు పోతున్నాయి. పాల ప్యాకెట్లను ఇంటింటికీ తిరుగుతూ దినేష్ విక్రయిస్తున్నాడు. పాడిగేదెల కోసం తమకున్న ఎకరం పొలంలో పచ్చిగడ్డిని పెంచుతున్నాడు. అలాగే వరిగడ్డి కట్టలను సైతం పోగు చేసి ఆహారంగా వేస్తున్నాడు. దాణా, తౌడు, కుడిది తదితర వంటివి ప్రతీరోజు పెడుతూ పాడిగేదెలను ప్రేమతో పెంచుతున్నాడు. వాటికి దోమలు కుట్టకుండా, షెడ్డులో ఫ్యాన్‌లను సైతం అమర్చాడు.



పాల ప్యాకెట్లను తయారు చేస్తున్న దినేష్

స్వయం ఉపాధితో ఆర్థికంగా బలపడాలి



కరట్లపల్లి దినేష్, యువరైతు, రత్నగిరి

స్వయం ఉపాధితో నిరుద్యోగ యువకులు ఆర్థికంగా బలపడాలి. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని నిరుద్యోగ యువకులు అధైర్యపడొద్దు. స్వయం ఉపాధి పొందాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా స్వయం ఉపాధితోనే సంతృప్తి కలుగుతుంది. నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి ఎన్నో రకాలుగా ఉన్నాయి. వాటిలో ఏదో ఒకటి ఎంచుకొని ఆర్థికంగా బలపడాలి.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది..
- కాంగ్రెస్ పాలన గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ఉంది..
- రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ వేర్వేరు కాదని, రెండు ఒకే తాను ముక్కలని, నాణానికి బొమ్మాబొరుసులాంటివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల హక్కుల కోసం శాసనమండలిలో గళం వినిపించేందుకు బీజేపీ పార్టీ రాష్ట్రంలో జరుగుతున్న రెండు టీచర్స్ ఎమ్మెల్సీ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయకలేక కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి 10 యేళ్లు పడితే.. 14 నెలల్లోనే కాంగ్రెస్‌పై, రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏనాడూ పట్టించుకోలేదని, మండలి అస్థిత్వాన్ని తగ్గించే విధంగా గతంలో కేసీఆర్ వ్యవహరించారన్నారు. అధికార పక్షం, ప్రశ్నించేతత్వం లేకుండా ఉండేందుకు కాంగ్రెస్‌లో ఉన్నవారందరనీ మూకుమ్మడిగా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. ప్రజల గొంతుకను వినిపించేందుకు 3 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమకారులతో పాటు టీజాక్‌లో పని చేసిన నాయకులు బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నారన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో సమస్యలపై ప్రశ్నిస్తాడన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిమరల్చేందుకు వారానికోసారి ఢిల్లీలో హాజరు వేసుకొని రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం, మోదీపై రేవంత్‌రెడ్డి అవాస్తవాలు పేల్చుతున్నాడని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు రానున్నరోజుల్లో గడ్డుకాలమేనని, కాంగ్రెస్ వాళ్లు ఎవరూ బయట తిరిగే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ హామీలపై రానున్నరోజుల్లో బీజేపీ ఎక్కడికక్కడ నిలదీస్తూ ప్రశ్నిస్తుందన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. గత నోటిఫికేషన్‌లలో ఎంపికైన వారికే నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టడంవల్ల ఆయా సంస్థల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వలేని దయనీయమైన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. డీఏలు, వేతన సవరణ కమిటీలపై ఆలోచనే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క డీఏ పెండింగ్‌లో లేకుండా మోదీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసిన కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నాడని విమర్శించారు. ఏ భూములు అమ్ముకుందాం.. ఏ సంస్థలో అప్పులు తెచ్చుకుందామనే ఆలోచలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలు, హామీలను అమలు చేయడానికి వాళ్ల దగ్గర రోడ్డు మ్యాప్‌లేదని, గుడ్డెద్దు చేనులో పడ్డ చందంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. రేవంత్‌రెడ్డి మాటలతో తెలంగాణ ప్రజల కడుపు నిండదని, బలహీన వర్గాల గృహసముదాయాల కోసం ఒక్క పునాదిరాయి కూడా వేయని కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య పెద్దగా తేడా లేదన్నారు. రాష్ట్రంలో అప్పుల భారం పెరుగుతోందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు రంగు వేసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

చివరిగా విలేకరులకు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రూ.10లక్షల కోట్లు నిధులు కేటాయించడంతోపాటు రూ.10 లక్షల కోట్లు రుణాల పేరిట ఇచ్చామని వివరించారు. కులగణన సర్వేకు సానుకూలంగా ఉన్నామన్నారు. అనంతరం హంటర్‌రోడ్డులో జరిగిన ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనంలో అభ్యర్థి సరోత్తంరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రాష్ట్ర నాయకులు కాశీప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, జిల్లా నాయకులు ఆర్‌పి జయంత్, చల్లా జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖండాంతరాలు దాటిన ప్రేమ

- అమెరికా అమ్మాయి.. నీరుకుళ్ల అబ్బాయి

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అమ్మాయి జెస్సికతో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన అబ్బాయి తాటిపర్తి సతీష్‌చంద్రతో హిందూ సంప్రదాయ ప్రకారం హనుమకొండలోని ఏఆర్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వివాహం జరిగింది. నీరుకుళ్ల గ్రామానికి చెందిన తాటిపర్తి రఘునాథరావు ఏకైక పుత్రుడు సతీష్ చంద్ర అమెరికాలో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డాడు. అమెరి కాకు చెందిన జెస్సికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీ కారంతో వివాహం చేసుకోవడానికి వారిద్దరు నిశ్చయించుకున్నారు. ఆదివారం హిందూ సంప్రదాయ ప్రకారం జెస్సిక మెడలో సతీష్‌చంద్ర మాంగళ్యధారణ గావించి అర్థాం గిగా స్వీకరించారు. ఈ కల్యాణ మహోత్సవానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వధూవరులను ఆశీర్వదించారు. తాటిపర్తి రఘునాథారావు హనుమకొండలో సిమెంట్ పైప్‌ల కంపెనీ పెట్టుకొని స్థిరపడ్డారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

ఘనంగా సదాశివరావు స్మారక కవి సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షుడు, వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత బండారు సదాశివరావు స్మారక కవి సమ్మేళనం హంటర్‌రోడ్‌లోని శ్రీ వ్యాస ఆవాసంలో ఆదివారం వైభవంగా జరిగింది. 'హిందువుగా జీవించు.. హిందువునని గర్వించు..' అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో అనేక మంది కవులు ఉత్సాహంగా పాల్గొని కవితాగానం చేశారు. ప్రముఖ కవి, పిల్లల వైద్యులు బండారు ఉమామహేశ్వర్‌రావు కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించగా జాతీయ సాహిత్య పరిషత్ నగర ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి కవి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంచాలక్ ఆచార్య చిలకమారి సంజీవ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.శివసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సదాశివరావు రాసిన అగ్నిమూర్తులు గ్రంథంపై వరిగొండ కాంతారావు స్మారకోపన్యాసం చేశారు. జీవనపర్యంతం జాతీయవాదమే ఊపిరిగా జీవించిన మహావ్యక్తి సదాశివరావు అని ఆయన ఆశయం అందరికీ ఆదర్శకం కావాలన్నారు. వ్యాసప్రతిష్ఠ కార్యదర్శి బూర రాంచందర్‌తోపాటు పెద్ద సంఖ్యలో కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులందరికీ ప్రత్యేక జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. లక్ష్మణ్, సుధాకర్ సంయోజకులుగా వ్యవహరించారు.



సమ్మేళనంలో పాల్గొని, సత్కారం అందుకున్న కవులు

ఆవిష్కరణల మాంత్రికుడు యశ్వంత్

- అంతర్జాతీయ హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి
- గ్లోబల్ నాసా స్పేస్ యాప్ చాలెంజ్ పోటీల్లో స్పెషల్ జ్యూరీ అవార్డు
- అరుదైన రెండు అవార్డులు సొంతం చేసుకున్న హనుమకొండ వాసి

హనుమకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గ్లోబల్ నాసా స్పేస్ యాప్ చాలెంజ్ పోటీల్లో యశ్వంత్ టీమ్ ఇటీవల స్పెషల్ జ్యూరీ అవార్డును అందుకున్నది. అలాగే యశ్వంత్ కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ హైపర్మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్, ఏఐ చాలెంజ్ ఇంటర్నేషనల్ హ్యాకథాన్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా కూడా నిలిచాడు. ఇలా రెండు అవార్డులు అందుకున్న వారు చాలా అరుదు. హనుమకొండ బాలసముద్రంలో నివాసముంటున్న ఈ యువ మేధావి స్వస్థలం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం. యశ్వంత్ నాన్న ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్. ఈ నేపథ్యంలో యశ్వంత్ విజయ రహస్యం మీ కోసం.

533 బృందాలతో పోటీ

కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్న యశ్వంత్.. నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. గత నెలలో అంతర్జాతీయ స్థాయిలో రెండు అవార్డులు అందుకొని ఎందరికో ప్రేరణగా నిలిచాడు. అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నాలెడ్జ్ గ్రాఫ్ హ్యాకథాన్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన యశ్వంత్ కృష్ణ. విజేతగా నిలిచి మూడు వేల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీ అందుకున్నాడు. ఈ పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 533 బృందాలు పాల్గొనగా, భారత్ నుంచి పాల్గొన్న యశ్వంత్ టీమ్ ప్రథమ బహుమతి సాధించడం విశేషం.

అలాగే అంత ర్జాతీయ గ్లోబల్ నాసా యాప్ చాలెంజ్ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. పంజాబ్‌లో జనవరిలో జరిగిన ఈ పోటీ ల్లో యశ్వంత్ టీమ్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకొని పలువురి మన్ననలు అందుకున్నది.



యశ్వంత్ టీమ్‌ను అభినందిస్తున్న టీ-వర్క్స్ సీఈవో జోగేందర్



యశ్వంత్ కృష్ణ

నాసా స్పేస్ యాప్స్ చాలెంజ్ అంటే..?

నాసా ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ చాలెంజ్ అనేది ప్రపంచ వ్యాప్తంగా కోడర్లు, శాస్త్రవేత్తలు, డిజైనర్లు, థీమ్ నిపుణులు, తయారీదారులు సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తల కోసం ఉద్దేశించిన ఒక హ్యాకథాన్. ఈ చాలెంజ్‌లో పాల్గొన్న వ్వు డు ఒకేలాంటి ఆలోచనలు గల వ్యక్తులను కలిసే అవకాశం లభిస్తుంది. సైన్స్, టెక్నాలజీని సృజనాత్మకంగా ఉపయోగించడం ద్వారా కొత్త అన్వేషణల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నాసా స్పెస్ చాలెంజ్ బృందాలు నాసా నిపుణులు విసిరిన సవాళ్లను పరిష్కరించే సమర్థతను బట్టి విజేతలుగా నిలుస్తారు. ఆ కోవలో యశ్వంత్ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. నాసా భారతదేశంలో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో యశ్వంత్ బృందం పాల్గొని ప్రతిభను కనబరిచింది. ఆ తర్వాత పంజాబ్‌లో నిర్వహిం చిన గ్లోబల్ స్థాయి చాలెంజ్‌లో పాల్గొన్నది. ఇక్కడ కూడా యశ్వంత్ టీమ్ అసాధారణ ప్రతిభను ప్రదర్శించి టాప్ టెన్ టీమ్‌లో ఒకటిగా నిలించింది. ఈ పది టీమ్‌లకు ఒక్కొక్క అంశంలో ఒక్కో అవార్డు లభించింది. ఇందులో భాగంగా యశ్వంత్ టీమ్‌కు పీపుల్స్ చాయిస్ అవార్డు దక్కింది. కాలేజీ స్థాయిలో పోటీ చిన్నగానే ఉన్నప్పటికీ గ్లోబల్ స్థాయి పోటీ మాత్రం కఠినంగా ఉంటుంది. ఈ చాలెంజ్‌ను 48గంటల్లో విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. యశ్వంత్ టీమ్ ఈ చాలెంజ్‌లో భాగంగా నాసా కనిపెట్టిన ఒక టెలిస్కోప్‌ను ఇతివృత్తంగా తీసుకున్నారు. ఈ టెలిస్కోప్ గురించి సాధారణ ప్రజలకు అంతగా తెలియదు. నాసా విసిరిన సవాల్ మేరకు యశ్వంత్ బృందం ఈ టెలిస్కోప్ గురించి అందరూ చాలా సులభంగా తెలుసుకునే విధంగా ఒక వెబ్‌సైట్‌ను నిర్ణీత గడువులో రూపకల్పన చేశారు. అలా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన అవార్డును సొంతం చేసుకున్నారు.

మరో హ్యాకథాన్ ఏమిటంటే ?

యశ్వంత్ టీమ్ పాల్గొన్న మరొక చాలెంజ్ అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), నాలెడ్జ్ గ్రాఫ్ హ్యాకథాన్. ఇందులో కూడా విజయం సాధించారు. ఈ పోటీ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 48 రోజులు నిరంతరాయంగా కోడింగ్ చేసి ఇచ్చిన గడువు పూర్తయ్యే నాటికి పోటీ నిర్వాహకులు సూచించిన ఒక ప్రాజెక్టును రూపొందించాలి. ఇది సదరు కంపెనీ సాఫ్ట్‌వేర్‌కు అనుగుణంగా వారికి ఉపయోగపడే రీతిలో ఉండాలి. ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 533 బృందాలు పాల్గొన్నగా యశ్వంత్ బృందానికి ప్రథమ బహుమతి వచ్చింది.

మిర్చి రైతులకు కష్టాలే..

మార్కెట్‌లో ధరలు లేక విలవిల • తడిసిమోపెడవుతున్న సాగు ఖర్చు • రాబడిలేక తప్పని నష్టాలు



మార్కెట్‌కు తరలించేందుకు బస్తాల్లో మిర్చి నింపుతున్న కూలీలు

వాజేడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అధికంగా సాగు అయ్యే పంట మిర్చి. మార్కెట్‌లో దీని ధరలు రోజు రోజుకూ పడిపోతుండటంతో రైతులు లబోదిబోమం టున్నా రు. గతేడాది నష్టాల నుంచి తేరుకోని రైతులకు ఈసారి కూడా అదే పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఏడాది కూడా అలానే ఉండటంతో అప్పుల పాలవుతూ కష్టాలను చూస్తున్నారు.

జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగుడెం, తాడ్వాయి మండలాల్లో మిర్చి పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో సుమారు 30వేల ఎకరాలకు పైగా మిరప పంటను సాగుచేస్తుండటం విశేషం. వాజేడు, వెంకటాపురం మండలాల మిర్చి పంటకు గతంలో మంచి డిమాండ్ ఉండేది. ఈ మండలాల నుంచి మర్చిని 2018 వరకు గుంటూరు మార్కెట్‌కు తరలించి విక్రయాలు జరిపేవారు. ప్రస్తుతం వరంగల్ మార్కెట్ దగ్గరగా ఉండటంతో రైతులు అక్కడి తరలించి మిర్చి పంటను అమ్ముకుంటున్నారు.

ధర అంతంతమాత్రమే:

ఆరుగాలం కష్టించి పండించిన మిర్చి పంటకు మార్కెట్‌లో ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. క్వింటా రూ. 14 వేల లోపే పలుకుతుండటంతో రైతులు నష్టాల బారిన పడాల్సి వస్తోంది.రెండేళ్ల క్రితం మార్కెట్‌లో క్వింటా మిర్చి రూ. 28వేల వరకు ధర పలకగా గత రెండేళ్ల నుంచి మార్కెట్‌లో మిర్చి ధరలు రూ. 15వేల లోపే పలుకుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల పాటు కష్టించి పండించిన పంటకు సరైన రేటు దక్కకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మిర్చి రకాన్నిబట్టి ధర ఉండటంతో ఒక్కో రకం మిర్చికి రూ10వేల నుంచి రూ.14 వేల లోపే ధరను మిర్చి వ్యాపారులు నిర్ణయిస్తున్నారు. గతేడాది మిర్చికి ధర లేకపోవడంతో రైతులు తమ పంటను ఏసీ కోల్డ్‌స్టోరేజీల్లో భద్రపరిరిచారు. ఈ క్రమంలో గతేడాది పంటే సుమారు కోల్డ్ స్టోరేజీలలో 60 లక్షల క్వింటాల్ వరకు ఉన్నట్లు సమాచారం. ఆ పంటను సైతం అమ్ముకునే స్థితిలో రైతులు లేకపోవడం, ఈ ఏడాది పండించిన పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన పెట్టుబడులు

మిర్చి పంట సాగుకు పెట్టుబడులు అధికంగా పెరిగాయి. ఒక్కో ఎకరం మిర్చి సాగుకు రూ. 2 లక్షలకు పైగా ఖర్చు అవుతున్నాయి. విత్తనాల నుంచి మొదలుకొని, దుక్కులు, మల్చింగ్ పేపరు, డ్రిప్ పైపులు, పురుగుమందులు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోవడంతో రైతులపై అధికంగా భారం పడుతోంది. మిర్చి పంటను కోసేందుకు వచ్చే కూలీలకు సైతం రోజువారీ ఖర్చుల నిమిత్తం ఇచ్చే నగదు కూడా రైతుల వద్ద లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూలీలకు నగదును చెల్లించేందుకు రైతులు వడ్డీలకు అప్పులు తెస్తున్నట్టు సమాచారం. పెరిగిన ఖర్చులతో పోలిస్తే మార్కెట్‌లో ఉన్న ప్రస్తుత ధరలకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులు అంతంతమాత్రమే..

మిరప పంట ఈ ఏడాది ఆశించినంత దిగుబడులు లేవని రైతులు తెలుపుతున్నారు. గతేడాది తెగుళ్లతో నష్టపోయిన రైతులు ఈ ఏడాది అంతగా తెగుళ్ల లేకపోయినప్పటికీ దిగుబడులు తగ్గిపోయాయయని వాపోతున్నారు. ఎకరానికి సుమారు 20క్వింటాల్ పంట కూడా దిగుబడి కావడం లేదని అంటున్నారు. ధరలు లేక, దిగుబడులు లేక రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.గతేడాది తీసుకొచ్చిన అప్పులు చెల్లించే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాండ్ రైతులు కొంత మెరుగు

ఏజెన్సీలో పలు బాండ్ కంపెనీలు ఒప్పంద ప్రాతిపదికన మిర్చిని రైతులతో సాగు చేస్తున్నాయి. కంపెనీ చెప్పిన ప్రకారం వారిచ్చిన మందులతో సాగు చేసే రైతుల పరిస్థితి కొంత మెరుగనే చెప్పొచ్చు. మార్కెట్ ధరతో రూ. 2 వేలు అధికంగా బాండ్ కంపెనీలు చెల్లించడంతో ఈ రైతుల పరిస్థితి కాస్తంత మెరుగని తెలుస్తోంది. ఈ క్రమంలో వారు కూడా నష్టాలను ఎదుర్కోనే పరిస్థితి తప్పదని, కంపెనీలు చెప్పిన మందులు, ఇతర ఖర్చులు పెరిగాయని సమాచారం.

విదేశాలకు ఎగుమతులు లేకపోవడంతో

మూడేళ్ల క్రితం వరకు దేశంలో పండించే మిర్చి పంటకు విదేశాలలో మంచి డిమాండ్ ఉండేది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం విదేశాలకు ఎగుమతులు చేసే పంటలపై కొంత మేర ఆంక్షలు విధించడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ముఖ్యంగా చైనా, రష్యా, ఇతర పెద్ద దేశాలకు ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో మనదేశంలో పండే పంట నిల్వలు ఇక్కడే ఉండిపోవడంతో మార్కెట్‌లో ధరలు పడిపోయాయి అని విశ్లేషకులు చెబుతున్నారు.

ఏదేమైనప్పటికీ ఈ ఏడాది మిర్చి రైతులు గట్టెక్కాలంటే మార్కెట్‌లో ధరలు సుమారు రూ. 20వేలకు పైగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

రామప్పకు పాలక మండలి లేనట్టేనా?

• కొలువుదీరక ఏడేళ్లు.. కార్యవర్గం లేకుండానే కార్యక్రమాలు

• ఏర్పాటు చేసి తీరాలంటున్న భక్తులు



రామప్ప ఆలయం

వెంకటాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుప్రసిద్ధ కాకతీయుల కళాకట్టడం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో పాలక మండలి కొలువుదీరడం లేదు. ఏడేళ్లుగా నియామకానికి నోచుకోవడం లేదు. దీంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా అధికారుల మధ్య సమన్వయం లోపించడం, భక్తులకు కావాల్సిన సౌకర్యాలు తదితర కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యమవుతోందని తెలుస్తోంది. ఆలయంలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలను అధికారికంగా సమకూరుతున్నా వాటి నిర్వహణ, పారదర్శకతను పరిశీలించేందుకు పాలమండలి ఏర్పాటు అవసరమనే డిమాండ్ వస్తోంది. ఈనెల 26 నుంచి 28 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనుండగా ఈసారి కూడా పాలక మండలి లేకుండానే వేడుకలు జరగనున్నాయి. ఏడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. మరో పదిరోజుల్లో మహా వేడుక నిర్వహించాల్సి ఇప్పటివరకు ఆలయ పాలకమండలిని దేవాదాయ శాఖ ప్రకటించలేదు. దీంతో ఈసారి కూడా పాలకమండలి లేకుండానే ఉత్సవాలు జరిగే అవకాశం ఉంది.

రామప్ప ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను మూడురోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల కోసం ఎండోమెంట్ అధికారులు పాలకమండలిని ఏర్పాటుచేసి చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఆ పాలకమండలి నేతృత్వంలో మహాశివరాత్రి ఉత్సవాల కోసం మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటారు. రామప్పకు వేలాదిమంది భక్తులు వచ్చి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గతంలో తొమ్మిది మంది సభ్యులతో పాలకమండలి ఏర్పాటు చేశారు. సుమారు ఏడేళ్ల సుదీర్ఘకాలంపాటు చైర్మన్ లేకపోవడంతో దేవాలయంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈవిషయంపై ఎండోమెంట్ ఈవో బిల్ల శ్రీనివాస్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో పాలకమండలి ఏర్పాటుపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క స్పందించి రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయానికి పాలకమండలిని నియమించేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేటి ప్రజావాణి రద్దు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని తాత్కలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇది గమనించాని, సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందులు పడొద్దని కోరారు.

'సోనియమ్మ కుటీరం'లో యువజన నేతలు



యువజన కాంగ్రెస్ సదస్సులో జిల్లా నేతలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలోని నిర్వహిస్తున్న సోనియమ్మ కుటీరం సదస్సుకు భూపాలపల్లి జిల్లా నుంచి ముఖ్య నేతలు తరలివెళ్లారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బండం ఉమేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కరుణాకర్, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు నగునూరి రజినీకాంత్‌తోపాటు మరో 15 మంది యూత్ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ నాయకులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి తరలివెళ్లిన వారిలో బండం ఉమేష్‌రెడ్డి ప్రసంగించారు. రాబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న అభ్యర్థికి అధిక మెజారిటీతో గెలిపించుకొనేందుకు సమన్వయంతో ప్రచారం చేస్తామన్నారు. జిల్లాలో కూడా యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేలా ఎప్పటికప్పుడు రాష్ట్ర, జాతీయ నాయకత్వం సూచనలను అనుసరిస్తామని చెప్పారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలికి ఆత్మీయ సన్మానం



సుగుణను శాలువాతో సన్మానిస్తున్న శారద, మహిళలు

కాటారం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన అంగోత్ సుగుణను జడ్పీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్‌లీడర్, మహా ముత్తారం మాజీ జడ్పీటీసీ లింగమల్ల శారద, బొర్లగూడానికి చెందిన మహిళా కాంగ్రెస్ నాయ కులు ఆదిలక్ష్మి, రజిత తదితరులు ఆదివారం ఆత్మీయ సన్మానం చేశారు. సుగుణను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

మహదేవపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దుద్దిళ్ల శ్రీపాదరావు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల నాయకుడు చల్లా తిరుపతిరెడ్డి విద్యార్థులకు క్రీడా సామగ్రి, నెట్‌బాల్ అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిట్యాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిట్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010- 11 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకుని ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సారంగపాణి, రవీందర్, కుమార్, సుధాకర్, రమేశ్, కార్తీక్, రవికుమార్, రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, హాజీ నూరానీ, సుమిత్రాదేవి, దామోదర్, రఘు తదితరులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుగ్యాల సందీప్, గుండ సురేశ్, శ్రీపతి రమణ, వెంకటేశ్, ఆమని, కొక్కుల మౌనిక, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్ష నెరవేరి ఆరేళ్లు

(5వ పేజీ తరువాయి)

పునాది పడింది. ఆతర్వాత తుపాకులగూడెంలో సమ్మక్క బ్యారేజీ నిర్మాణమైంది. కానీ, గోదావరి జలాలు జిల్లా రైతాంగం దోసిలి నింపడంలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నదీ పరీవాహక మండలాలతోపాటు అన్ని చోట్ల ఎత్తిపోతల పథకాలకు ప్రణాళిక రూపొందిస్తున్నా ఆచరణ సాధ్యం కావాల్సి ఉంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సమ్మేళనం మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ పండుగగా గుర్తింపు దక్కాల్సి ఉంది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటై ఏజెన్సీ వాసులకు సేవలు అందుబాటులోకి రావాలి. 11 ఏళ్లక్రితం మూతపడ్డ బిల్ట్ పరిశ్రమ తలుపులు మళ్లీ తెరుచుకొని ఉపాధి మెరుగుపడాల్సి ఉంది. మల్లంపల్లిలో సిమెంట్ అనుబంధ కర్మాగారం, ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులు, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు కావాల్సి ఉంది.

గోదావరి వరదల నుంచి ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని తీరగ్రామాలను రక్షించేందుకు చేపట్టిన కరకట్ట పనులు నత్తనడకన సాగుతున్నాయి. జీయో ట్యూబ్ టెక్నాలజీని అమలుచేసే ప్రక్రియ నిధుల కేటాయింపుతో ఆలస్యమవుతోంది. దీంతో ఈసారీ వరద ముప్పు తప్పదనే వాదన వినిపిస్తోంది.

ఫలించిన 'కంటైనర్' ప్రయోగం

జిల్లాలోని మారుమూల అడవి పల్లెలకు విద్య, వైద్య సౌకర్యాలను చేరువచేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కంటైనర్లు ఫలితాన్ని చ్చాయి. తొలిసారి తాడ్వాయి మండలం పోచాపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఆస్పత్రికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గూడానికి అత్యవసర వైద్య సేవలు అందు బాటులోకి వచ్చాయి. ఇదేక్రమంలో కన్నాయిగూడెం మండలం ఐలా పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌సెంటర్‌ను ప్రారంభించాల్సి ఉంది. ఇదే మండలం కంతనపల్లి పంచాయతీ పరిధి బంగారిపల్లెలో కంటైనర్ ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల ద్వారా అక్కడి ఆదివాసీ చిన్నారులకు చదువు చెబుతున్నారు. శాశ్వత నిర్మాణాలకు అటవీ చట్టాలు అడ్డంకిగా మారుతున్న ఏజెన్సీ ప్రాంతంలో ఈ కంటైనర్ల ఏర్పాటు ప్రత్యామ్నాయంగా మారడం, పక్క రాష్ట్రాల్లో అమలుకు పరిశీలిస్తుండడం విశేషం.

దేవాదుల మోటార్లు బంద్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధి గుట్టల గంగారం వద్ద ఉన్న జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి నాలుగు మోటార్లను ఆదివారం ఇంజినీరింగ్ అధికారులు నిలిపి వేశారు. శనివారం వరకు ఫేజ్-2లో ఒక మోటారు, ఫేజ్-3లో నాలుగు మోటార్లు.. మొత్తం ఐదు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోశారు. ఆదివారం ఫేజ్-2లోని ఒక మోటారు, ఫేజ్-3లోని మూడు మోటార్లు.. మొత్తం నాలుగు మోటార్లు ఆఫ్ చేసి కేవలం ఫేజ్-3 నుంచి ఒక మోటారును ర న్ చేస్తూ 292 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజికి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గి పోయింది. దీంతో ప్రాజెక్టులోని అన్ని గేట్లు మూసి వేసి వచ్చిన నీటిని వచ్చినట్లే నిల్వ చేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గటంతో దేవాదుల పంపింగ్ చేసేందుకు నీటి నిల్వలు సరిపోక పంపింగ్‌ను నిలిపి వేసి, వచ్చిన నీటిని వచ్చి నట్లు నిల్వ చేస్తున్నట్లు సమాచారం. సమ్మక్క ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.52 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తి స్థాయి నీటిమట్టం నిల్వ చేస్తే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొంత భూభాగం ముంపునకు గురవతుండటంతో అక్కడి ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ రాకపోవడంతో అక్కడి ప్రభుత్వం అభ్యంతరం పెట్టడంతో బ్యారేజీలో పూర్తి స్థాయి నీళ్ల నిల్వ చేయటం లేదు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 79.00 మీటర్లు నీటిమట్టం నమోదు కాగా సమ్మక్క సాగర్ వద్ద 79.10 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : బీఆర్ఎస్

వెంకటాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల హామీలన్నీటిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వే సహేతుకంగా లేదని, జనాభా వివరాలను వెల్లడించకుండా పాత జనాభా లెక్కలను బహిర్గతం చేసిందని ఆయన విమర్శించారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదినం సందర్భంగా సోమవారం నిర్వహించే గ్రీన్ ఇండియా చాలెంజ్ వాల్ పోస్టర్‌ను ఆదివారం ములుగులో మాజీ జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ ములుగు ఇన్‌చార్జి ప్రవీణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, నాయకులు గరిగ రఘు, వేములపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, ఎమ్డీ.యూనుస్, బొమ్మినేని సురేష్‌రెడ్డి, దేవర రాజు, విజయ, స్వరూప, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను కొనసాగించాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారంలో పారిశుధ్య నిర్వహణను కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈగలు, దోమల ప్రబలకుండా రసాయన మందులు పిచికారీ చేయాలని అంటున్నారు. జాతర జరిగిన స్థలాల్లో భక్తులు వదిలిన వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. గత జాతరల అనంతరం అధికారులు మేడారం వైపు చూడడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతరలకు ముందు కలెక్టర్, అధికారులు మేడారంలో ఎలా పర్యటించి పర్యవేక్షించారో అదే విధంగా అనంతరం కూడా పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా కొన్ని రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని కొనసాగించి స్థానికులకు, భక్తులకు వైద్య సౌకర్యం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లారీల యజమానులు డీడీలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అదేవిధంగా క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఒక లారీకి బదులు మరొక లారీలో ఇసుకను తరలించినా, ఓవర్ లోడ్ ఉన్నా, జేసీబీ లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

గోవిందరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపల్లి కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు ఈక అప్పయ్య సతీమణి సారక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పార్టీ తరఫున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రస్పూత్ సీతారాంనాయక్, సహకార సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి, నాయకులు చింత క్రాంతి, ఈక జగ్గారావు, పెండెకట్ల బాలరాజు, పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ



భూపాలపల్లిలో పర్యావరణ అవగాహన ర్యాలీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాలని హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ర్యాలీ సందర్భంగా వారు పర్యావరణానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు పర్యావరణ హిత ఇంధనాన్ని వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డీలర్లు అశోక్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



స్వామివారి సన్నిధిలో భక్తులు



హేమాచలుడి మూలవిరాట్

మంగపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకోవ డానికి భారీ సంఖ్యలో తరలివచ్చి దర్శనా లు చేసుకున్నారు. వారాంతపు సెలవు కావ డంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తర లివచ్చారు. సుమారు 10 వేల మంది దైవదర్శనాలు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

భక్తులు ఉదయాన్నే కొండపైకి చేరి చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకు న్నారు. అనంతరం కొండపై కొలువుదీరిన స్వయంభే పుట్టుస్వా మిగా విరాజిల్లుతున్న లక్ష్మీనరసింహ స్వామిని, పక్కనే కొలువు దీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు చీరే, సారే, పూలు, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానా ర్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణ శర్మ, వెంకటనారాయణశర్మ మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకాలు చేసి గజ మాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవదర్శనాలు గావిం చారు. అనంతరం దేవస్థా నం ఆధ్వర్యంలో ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు.

భద్రాద్రి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. రైతు మృతి



హన్మంతరావు (ఫైల్)

మంగపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని దుగినేపల్లి, శగరిశల గ్రామాల మధ్య ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మంగపేట మండలంలోని కొత్తమల్లూరుకు చెందిన రైతు మాటూరి హన్మంతరావు(52) అక్కడికక్కడే మృతి చెందాడు. తోడల్లుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గీసురెల్లికి చెందిన మునిగాల నాగేశ్వర్ రావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఇసుక లారీ ఢీకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడు హన్మంతరావుకు శంకరమ్మ, వరలక్ష్మి ఇద్దరు భార్యలు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో హన్మంతరావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

సివిల్ సప్లయ్ హమాలీ మృతి



ఎల్లయ్య (ఫైల్)

చిట్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం పనిచేస్తున్న హమాలీ ఆరెపెల్లి ఎల్లయ్య (57) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం సివిల్‌సప్లయ్ గోదాం ఇన్‌చార్జి గంగాదర రాజు బాధిత కుటుంబాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. తక్షణ సహాయం నిమిత్తం రూ20 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట హమాలీలు సరిగొమ్ముల సురేశ్, ముత్యాల మధు, ఆరెపెల్లి సమ్మయ్య, కట్కూరి కుమార్, శీలపాక నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

మంగపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు మండలంలోని బ్రాహ్మణపల్లి, చింతకుంట, తక్కళ్లగూడెం, నిమ్మగూడెం, రామచంద్రునిపేటలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రావలు జానకీరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటువేసి అత్యాధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామిడి సురేష్ పటేల్, బీజేపీ మండల కార్యదర్శులు బొల్లికొండ సాంబయ్య, నిడుదవోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.